జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
శనివారం | 25 | జులై | 2026 ◆ పేజీలు : 8



## ఖమ్మం జిల్లా త్రాగునీటి అవసరాలకు గోదావరి జలాలు

- రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ఏన్కూరు కెనాల్ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** రాష్ట్రంలో నెలకొన్న 'ఎల్ నినో' తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల ఖమ్మం జిల్లా ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కొకుండా ప్రజా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. భద్రాచలం వద్ద సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను తాగునీటి అవసరాల కోసం ఖమ్మం జిల్లాకు అందిస్తోందని

మిగతా 2 లో...



## ఆగస్టు 30 నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- జూలై 27 నుంచి 29 వరకు రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను విజయవంతం చేయాలి
- నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** ఆగస్టు 30 నాటికి ప్రభుత్వ, రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ పాఠశాలల విద్యార్థులందరికీ రెండు జతల నాణ్యమైన యూనిఫాంలను అందించేలా అన్ని దశల్లో పకడ్బందీ ప్రణాళికతో పని చేసి, నిర్దేశిత గడువులోగా కుట్టు పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, సెర్ప్ సీఈవో దివ్య, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ లతో కలిసి పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతి, సీజనల్ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ ర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి పంటల వైవిధ్యీకరణ అత్యంత ముఖ్యమైన అజెండా అని అన్నారు. గత ఏడాది ఇదే తేదీ నాటికి రాష్ట్రంలో సుమారు

మిగతా 2 లో...

## నిరుపేదలకు చేయూతగా కళ్యాణ్ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్



- ఎమ్మెల్యే రాగమయి
- కళ్యాణ లక్ష్మి 71 మందికి రూ.71 లక్షల అందజేత
- ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోరుకునేది కాంగ్రెస్ పార్టీ

**సత్తుపల్లి జూలై 24 (ప్రజాజ్యోతి)** నిరుపేదల అయ్యుండి తెలంగాణ రాష్ట్ర ప్రాంతానికి చెందిన వారై వివాహం చేసుకున్న వారికి కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ కింద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సత్తుపల్లి రూరల్ ప్రాంతాలకు చెందిన ఇటీవల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ (సీఎం రిలీఫ్ ఫండ్) మరియు కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద 37 మంది లబ్ధిదారులకు రూ.16,18,900 విలువైన చెక్కులను, కళ్యాణ లక్ష్మి పథకం కింద 71 మంది లబ్ధిదారులకు రూ.71,08,236 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా చేయూత

మిగతా 2 లో...

## మండల తహసిల్దార్, ఇద్దరు గిర్దావర్ ల బదిలీ నిలిపివేసినట్లేనా.?



- చర్చనీయాంశంగా మారిన అధికారుల ఆకస్మిక బదిలీ, నిలిపివేత

**బోనకల్, జూలై 24 (ప్రజాజ్యోతి):** బోనకల్ మండల తహసిల్దార్, ఇద్దరు గిర్దావర్లు, భూభారతి ఆపరేటర్ లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర ఈనెల 21వ తేదీన అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తహసిల్దార్ చల్లూరి సుధాకర్ ను కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా బదిలీ చేశారు. గిర్దావర్ – 2 జంగం గూడెం మైథిలినీ కూసుమంచి

మిగతా 2 లో...

## రోడ్డు ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- బ్లాక్‌స్పాట్లలో భద్రతా పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- ప్రమాదాల కారణాలపై సమగ్ర అధ్యయనం చేసి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- ప్రతి నెల మూడవ శుక్రవారం సమీక్ష
- ఖమ్మం కార్పొరేషన్,కల్లూరు,మధిర ,సత్తుపల్లి, ఏదులాపురం, వైరా పట్టణాల్లో వీధి వ్యాపారాలకు రెడ్‌జోన్ ప్రాంతాలు గుర్తించాలి
- మున్సిపల్ ప్రాంతాల్లో శాస్త్రీయ పార్కింగ్ విధానం అమలు చేయాలి
- రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, రోడ్డు భద్రతా విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు

మిగతా 2 లో...

# ఆగస్టు 30 నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించాలి

(మొదటి పేజీ తరువాయి...)

54 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 14 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు జరిగిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 1.39 కోట్ల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా ఇప్పటివరకు సగం విస్తీర్ణంలో మాత్రమే సాగు పూర్తైందని,మిగిలిన భూముల్లో సాధ్యమైనంత వరకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. భూములను బీడుగా వదిలి పెట్టకుండా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు.జూలై 27 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో నిర్వహించే ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని, పంటల వైవిధ్యీకరణలో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాలను ప్రభుత్వం అభినందిస్తుందని తెలిపారు.కంది,పెసర,మినుములు, ఇతర పప్పుధాన్యాలు, అలసందలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, చిరుధాన్యాలు వంటి పంటలను ప్రోత్సహించాలని, వరి సాగు జరగని భూముల్లో అధిక భాగాన్ని ప్రత్యామ్నాయ పంటల కిందకు తీసుకురావాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో బోరు నీటిపై ఆధారపడిన వరి సాగును నిరుత్సాహపరచాలని ఆదేశించారు.పంచాయతీరాజ్గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులందరికీ ఆగస్టు 15 నాటికి ఒక జత యూనిఫాం తప్పనిసరిగా అందించాలని తెలిపారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, డీఆర్డీఏ అధికారులు కుట్టు పనులను ప్రతి రోజూ పర్యవేక్షించాలని, యూనిఫాం వస్త్రాల కటింగ్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, సూపర్ ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, దాదాపు 40 శాతం వర్షపాతం లోటు నమోదైందని,భూగర్భ జలాలు కూడా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. రైతులకు ప్రస్తుత పరిస్థితులపై అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఆరు తడి పంటలు సాగు చేయవచ్చని, జూలై 27 నుంచి 29 వరకు అన్ని రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ఆయిల్పామ్ సాగును ప్రోత్సహించాలని, డ్రిప్ ఏర్పాటు, ఆయిల్పామ్ తోటల పురోగతిని పర్యవేక్షించాలని, మండల, గ్రామ స్థాయిలో కంటింజెన్సీ ప్రణాళికలు సిద్ధం చేసి రైతులకు వాతావరణ సూచనలు ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు.ఆగస్టులో కొంత వర్షం కురిసే అవకాశం ఉన్నప్పటికీ వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు సరిపోదని, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశముందని తెలిపారు.సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ,ప్రభుత్వ,రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ పాఠశాలల విద్యార్థులందరికీ ఆగస్టు 30 నాటికి రెండు జతల యూనిఫాంలు అందించడం లక్ష్యమని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల టైలర్లు కుట్టు పనులను రెట్టింపు వేగంతో పూర్తి చేయాలని సూచించారు. యూనిఫాం వస్త్రాలను మండల కేంద్రాలకు సరఫరా చేసి, పాఠశాలల వారీగా మాస్టర్ టైలర్ల ద్వారా వస్త్రాల కటింగ్ పూర్తి చేయాలని, అనంతరం మహిళా టైలర్ల ద్వారా విద్యార్థుల కొలతలకు అనుగుణంగా కుట్టించాలని ఆదేశించారు.మండల స్థాయిలో బటన్ హోల్,బటన్ ఫిక్సింగ్ యంత్రాలను వినియోగించి యూనిఫాంలను పూర్తి చేయాలని సూచించారు.ఆగస్టు 30 నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందేలా పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. పాఠశాల యూనిఫాంల సరఫరా ప్రభుత్వానికి అత్యంత ప్రాథమిక బాధ్యత అని పేర్కొంటూ,వస్త్రాల సరఫరా,కటింగ్,మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టు పనులు, యూనిఫాంల నాణ్యత తదితర ప్రతి దశను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.జిల్లా, మండల స్థాయిలో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి పురోగతిని సమీక్షించాలని,టిడ్కో,మఫత్లాల్ సంస్థల ద్వారా వస్త్రాల సరఫరాను రోజువారీగా పర్యవేక్షించాలని ఆదేశించారు. యూనిఫాంల నాణ్యతపై విద్యార్థుల నుంచి నేరుగా ఫీడ్బ్యాక్ సేకరిస్తామని,నాణ్యతలో లోపాలు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.పోర్టల్లో నమోదైన 26 వేల మంది మహిళా టైలర్లకు వెంటనే పనులు కేటాయించి, అవసరమైతే స్థానికంగా అదనపు శిక్షణ అందించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ,జిల్లాకు చేరిన క్లాత్, ఎంత మేర మండలాలకు పంపిణీ చేసింది, క్లాత్ కటింగ్ కొరకు ఉన్నది, ఎన్ని యూనిఫామ్ లు పూర్తయినవి,ఎన్ని పాఠశాలలకు పంపింది రోజువారీ నివేదిక సమర్పించాలన్నారు. రోజుకు 5 వేల నుండి ఐదున్నర వేల యూనిఫామ్ లు కుట్టడం జరగాలని, ఈ దిశగా పకడ్బందీ కార్యాచరణ చేయాలని అన్నారు. జిల్లా కంటింజెన్సీ ప్లాన్ ప్రకారం ఏ ఏ రకాల విత్తనాలు ఎంత మేర కావాలో ఇండెంట్ చేసి తెప్పించాలని కలెక్టర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ,శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్,ఎస్డీసి సదానందం,జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.రామారావు,డిఆర్డీవో శ్రీరామ్,జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు చేయూతగా కళ్యాణ్ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్

(మొదటి పేజీ తరువాయి...)

అందుతోందని, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అనంతరం గ్రంధాలయ చైర్మన్ షేక్. ఖాదర్ బాబాను సన్మానించిన మట్టా దంపతులు ఘనంగా సత్కరించారు. నిరుపేదలు కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పథకాలు అందుకుంటూ అభివృద్ధి దశలో ముందున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్పర్సన్ రెహనా కమల్ , వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,సర్పంచులు,ఉప సర్పంచులు,కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా త్రాగునీటి అవసరాలకు గోదావరి జలాలు



(మొదటి పేజీ తరువాయి...)

ఆయన అన్నారు.రెండు రోజులుగా నీటిని తరలిస్తున్న గోదావరి జలాలను డిప్యూటీ సీఎం భట్టి శుక్రవారం సాయంత్రం ఏన్కూర్ నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ రెడ్డిగూడెం వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఎల్ నినో ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, జిల్లాలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి దిశా నిర్దేశం దిశానిర్దేశం చేశారు. ఏన్కూర్ రెగ్యులేటర్ వద్ద నాగార్జున సాగర్ కాలువలోకి సీతారామ ఎత్తిపోతల పథకం నీటి పంపిణీ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. సీతారామ ప్రాజెక్టు నుంచి సుమారు 1,500 క్యూసెక్కుల గోదావరి నీటిని ఏన్కూర్ రెగ్యులేటర్ వద్దకు తీసుకువచ్చి, అక్కడి నుంచి ఎన్ఎస్పీ కాలువ ద్వారా పలు చెరువులకు, ప్రాజెక్టులకు నీటిని తరలింపు జరుగుతోంది.ఏన్కూర్ రెగ్యులేటర్ నుంచి ఎన్ఎస్పీ కాలువ ద్వారా దిగువ వైపునకు 1,000 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఈ నీరు సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న లంకా సాగర్ ప్రాజెక్టు వరకు వెళుతుంది.రెగ్యులేటర్ నుంచి ఎన్ఎస్పీ కాలువ ద్వారా పైభాగంలో ఉన్న ప్రాంతాలకు 500 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నారు. ఇందులో 250 క్యూసెక్కుల నీటిని వైరా రిజర్వాయర్కు మళ్లించడం జరుగుతోంది. మిగిలిన 250 క్యూసెక్కుల నీటిని పరిధిలోని చెరువులకు విడుదల చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్,రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్,అధికారులు,ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## మండల తహసిల్దార్, ఇద్దరు గిర్దావర్ ల బదిలీ నిలిపివేసినట్లేనా.?

(మొదటి పేజీ తరువాయి...)

తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా బదిలీ చేశారు. గిర్దావర్ – 1 సామినేని నరసింహారావుని ఏన్కూరు తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా బదిలీ చేశారు. భూభారతి ప్రవీణును పెనుబల్లి బదిలీ చేశారు. ఒకేసారి ఈ నలుగురును బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయటంతో బోనకల్ మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వీరు బదిలీ ఈనెల 21 ఆకస్మికంగా జరగటం. వీరు బదిలీ అయిన స్థానాల నుంచే తిరిగి అధికారులను బోనకల్ బదిలీ చేయటం వేగంగా జరిగాయి. బదిలీ ఉత్తర్వులు వెలువడిన రోజు నుంచే మండల తహసిల్దార్ బోనకల్లు లో విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. 23న గిర్దావర్ – 1 ఈనెల 23 నుంచి యధావిధిగా విధులకు హాజరవుతూనే ఉన్నారు. 24 నుంచి మరో గిర్దావర్ సామినేని నరసింహారావు విధులకు హాజరవుతున్నారు. భూభారతి ఆపరేటర్ ప్రవీణ్ కూడా యధావిధిగా విధులకు హాజరవుతున్నాడు. ఒకేసారి ముగ్గురు అధికారులను బదిలీ చేయటం మరల అంతే వేగంగా బదిలీ ఉత్తర్వులు కూడా నిలిపివేయటం తీవ్ర చర్చనీయాంసముగా మారింది. ఆకస్మిక బదిలీ బదిలీ, ఆకస్మిక బదిలీ నిలిపివేత ఎందుకు జరిగింది ఎలా జరిగింది అనేది మండలంలో తీవ్ర చర్చనీయంగా మారింది . ఎందుకు బదిలీ చేశారు, ఎందుకు బదిలీ ఉత్తర్వులు నిలిపివేశారు అనేది ప్రశ్నార్థకంగా మారింది.

## రోడ్డు ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పోలీస్, జాతీయ రహదారులు,రోడ్లు భవనాలు,మున్సిపల్, తదితర శాఖల అధికారులతో రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షించారు.సమావేశం ప్రారంభంలో గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల అమలు నివేదిక (యాక్షన్ టేకెన్ రిపోర్టర్ )ను కలెక్టర్ సమీక్షించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన బ్లాక్స్పాట్లలో చేపట్టిన అన్ని రోడ్డు భద్రత పనులను అత్యంత త్వరగా పూర్తి చేయాలని, జాతీయ రహదారులపై చేపట్టాల్సిన పనులను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పూర్తి చేయాలని, రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. జాతీయ రహదారుల వార్షిక నిర్వహణ పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు.పోలీస్ శాఖ సమర్పించిన గణాంకాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో బ్లాక్ స్పాట్లను గుర్తించి సరిదిద్దే చర్యలు చేపట్టినప్పటికీ, ఇప్పటికీ దాదాపు ప్రతి రోజూ ఒకరు ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రాణాంతక ప్రమాదాలకు గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి, అత్యవసర చర్యలు అవసరమైన చోట్ల యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని సూచించారు.ప్రతి నెల మూడవ శుక్రవారం రోడ్డు భద్రత సమీక్ష సమావేశం నిర్వహిస్తామని,పోలీస్,జాతీయ రహదారుల శాఖ, ఆర్ అండ్ బి అధికారులు సంయుక్తంగా రోడ్లను పరిశీలించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రతిపాదనలు,ప్రణాళికలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

వేగ నియంత్రణ కోసం ప్రతిచోటా స్పీడ్ బ్రేకర్లకే పరిమితం కాకుండా, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో జిగ్జాగ్ ట్రాఫిక్ మూవ్మెంట్ వంటి ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ చర్యలను అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రాధాన్యతా పనులపై నివేదిక ఇవ్వాలని సూచించారు.జాతీయ రహదారుల వెంట హోటళ్లు, ధాబాల వద్ద ట్రక్కులు రోడ్లపైనే పార్కింగ్ చేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, అలాంటి ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై పార్కింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ట్రాఫిక్ నిబంధనలను పదేపదే ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారికి గట్టి సందేశం వెళ్లేలా వ్యవహరించాలని తెలిపారు. బెల్ట్ షాపులు, బార్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు.జాతీయ రహదారులపై గుర్తించిన అక్రమ ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు.నిబంధనలకు విరుద్ధంగా ఉన్న యాక్సెస్ రోడ్లను తొలగించాలని,అనుమతులు లేని హోటళ్లు,ధాబాల వద్ద ఏర్పాటు చేసిన అక్రమ ప్రవేశ మార్గాలను కూడా తొలగించాలని ఆదేశించారు.

ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విస్తృతంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.రోడ్లపై ట్రాఫిక్కు ఆటంకం కలిగించే స్టాళ్లను సున్నితంగా తొలగించాలని, వీధివ్యాపారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుంటూనే ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం కలిగించే ప్రాంతాల్లో వ్యాపారాలను నియంత్రించాలని సూచించారు.ప్రధాన కూడళ్లు, రెడ్జోన్ ప్రాంతాల్లో మాత్రం వీధి వ్యాపారాలను అనుమతించరాదని,అవసరమైతే ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని తెలిపారు. ఖమ్మం, కల్లూరు, మధిర, సత్తుపల్లి, ఏదులాపురం వైరా పట్టణాల్లో వీధి వ్యాపారాలకు రెడ్జోన్ ప్రాంతాలను స్పష్టంగా గుర్తించాలని, ఆ ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ వీధి వ్యాపారాలను అనుమతించరాదన్నారు. వచ్చే సమీక్ష సమావేశం నాటికి అన్ని పట్టణ ప్రాంతాల్లో నో–వెండింగ్ / రెడ్జోన్ ప్రాంతాలను గుర్తించి నివేదిక సమర్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.మున్సిపల్ ప్రాంతాల్లో పార్కింగ్ను పూర్తిగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రస్తుతం ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటూ,బెంగళూరులో అమలవుతున్న శాస్త్రీయ పార్కింగ్ విధానాన్ని ఆదర్శంగా తీసుకొని జిల్లాలో కూడా అమలు చేయాలని సూచించారు.

వచ్చే మూడు నుంచి ఆరు నెలల్లో దశలవారీగా స్పష్టమైన మార్పు కనిపించేలా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ఈ చర్యలు నిషేధం కోసం కాదని, క్రమబద్ధీకరణ కోసమేనని స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రులు, పెద్ద షాపింగ్ సముదాయాల వద్ద కూడా పార్కింగ్ను సక్రమంగా నియంత్రించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న రూ.1.50 లక్షల వరకు క్యాష్లెస్ అత్యవసర వైద్య చికిత్స సదుపాయంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.ప్రమాదం జరిగిన తొలి గంటను 'గోల్డెన్ అవర్ గా పరిగణిస్తారని, ఆ సమయంలో బాధితులకు వెంటనే చికిత్స అందితే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య,డీఆర్ఓ సి.హెచ్.రామ్మూర్తి,నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య, డీఎంహెచ్వో డాక్టర్ రామారావు, ఐఆర్ఏడి డి.ఆర్.ఎం.ఎస్ హరి బాబు,పోలీస్, రోడ్లు భవనాల శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కాకరవాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బంద్

- ఎన్ఎస్‌యూఐ పిలుపు మేరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్



**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి** దేశ రాజధాని ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) దేశవ్యాప్తంగా ఇచ్చిన బంద్ పిలుపు మేరకు శుక్రవారం తిరుమలాయపాలెం మండలం లోని కాకరవాయి గ్రామంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ బంద్‌కు విద్యార్థులు, యువత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గ్రామంలోని పలు విద్యాసంస్థలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలతో మాట్లాడారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, విద్యార్థులు తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. అలాంటి విద్యార్థులపై బలప్రయోగం చేయడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.నిరసనలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ..దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల గొంతును అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్ జరగడం దేశవ్యాప్తంగా విద్యార్థి సమాజాన్ని కలచివేసిందని, ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన దాడికి సంబంధించి స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను దేశ ప్రజల ముందుంచాలని కోరారు. విద్యార్థులపై నమోదైన కేసులు ఉంటే వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని కూడా డిమాండ్ చేశారు.కాకరవాయి గ్రామంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించడం విశేషం. పలువురు విద్యార్థులు ఈ సందర్భంగా మాట్లాడుతూ..విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించిన ఈ నిరసనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో విభేదాలను అణచివేయడానికి లాఠీలు, బలప్రయోగం పరిష్కారం కాదన్నారు. విద్యార్థుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సింది పోయి వారిపై దాడులకు పాల్పడటం దురదృష్టకరమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించాలని, విద్యారంగానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా నిరసనలో పాల్గొన్న నాయకులు విద్యార్థుల ఐక్యతను అభినందిస్తూ, దేశవ్యాప్తంగా విద్యార్థుల హక్కుల కోసం జరుగుతున్న పోరాటానికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ, ఎన్ఎస్‌యూఐ తరఫున ఉద్యమాలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు కట్కూరి.శ్రీనివాస్ రెడ్డి,మోరపాక నాగయ్య, గుండాల లింగయ్య, కొత్తపెల్లి మల్లయ్య, దామర్ల కృష్ణ,గుండాల మహేష్,మోర శేసి ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువజన ప్రతినిధులు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఢిల్లీ విద్యార్థులపై లాఠీచార్జ్ కు నిరసన

- కల్లూరులో ప్రభుత్వ పాఠశాలల బంద్



**కల్లూరు, జూలై 24 :** ప్రజా జ్యోతి ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిను ఖండిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎస్ ఎస్ యు ఐ ) పిలుపుమేరకు శుక్రవారం కల్లూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను కాంగ్రెస్ యువజన కాంగ్రెస్ నాయకులు బంద్ చేయించారు.నాయకులు మాట్లాడుతూ విద్యార్థులపై పోలీసులు బల ప్రయోగం ప్రజాస్వామ్యం స్ఫూర్తికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల స్వేచ్ఛ నిరసనను అణిచివేయడం తగదని పేర్కొన్నారు. ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీచార్జ్ కు కారణమైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆళ్లకుంట నరసింహారావు, యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పరిమి భరత్, సోషల్ మీడియా ప్రతినిధి సయ్యద్ బాజీ, యువజన కాంగ్రెస్ నాయకుల షేక్ అఫ్రోజ్, దారా రాజీవ్, షేక్ సమీర్, భాగం బాబి, షేక్ సైదులు పాల్గొన్నారు.


## చింతకాని గ్రామ సభలో ఎల్ నినో పై అవగాహనా కార్యక్రమం


- సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో గ్రామ సభ

**చింతకాని జులై 24ప్రజాజ్యోతి :** మండలం కేంద్ర గ్రామ పంచాయితీ లో ఉదయం ఎల్ నినో పై రైతులకు అవగాహన సదస్సు కల్పించిన వ్యవసాయ అధికారులు.రాబోయే కాలం మరింత లోటు వర్ష ప్రభావం ఎక్కువగా ఉంటుంది, ఇప్పుడున్న పరిస్థితి లో వరి, పంటలు వేయకపోవడం మంచిది,ఆరుదల పంటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచనలు చేశారు. రైతులకు ఫామ్ పాండ్స్ సబ్సిడీ ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉండటం వలన ప్రభుత్వం రైతులకు ఫామ్ పాండ్స్ సబ్సిడీ అందిస్తుంది. వాటిని రైతులు ఉపయోగించుకోనీ ఫామ్ పాండ్స్ నిర్మించుకోవాలని సూచనలు చేశారు.ఈ కార్యక్రమం లో సెక్రటరీ రమేష్ బాబు,ఉప సర్పంచ్ కోలా ఉమారాణి, వార్డు మేబెర్స్, వ్యవసాయ అధికారులు, విద్యుత్ అధికారులు అంగన్వాడీ టీచర్స్ , ఆశా వర్కర్స్, పశుసంవర్ధక శాఖ, అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 15వ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్‌లో వార్షిక క్రీడా పోటీల ముగింపు

**సత్తుపల్లి జూలై24(ప్రజా జ్యోతి)**మండల పరిధిలోని గంగారం గ్రామం లో గల 15వ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన వార్షిక క్రీడా పోటీలు, స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి 15వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెద్దబాబు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా కమాండెంట్ ఎన్ . పెద్దబాబు మాట్లాడుతూ, పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం,మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విధి నిర్వహణలో ఎంత నిబద్ధత అవసరమో, ఆరోగ్య పరిరక్షణలో కూడా అంతే శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు.గత నాలుగు రోజులుగా నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో బెటాలియన్‌కు చెందిన అధికారులు, పోలీసు సిబ్బంది వివిధ క్రీడా విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు అని, పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కమాండెంట్ చేతుల మీదుగా ట్రోఫీలు, మెడల్స్ ప్రశంసా పత్రాలు అందజేశారు.ముగింపు వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు, బెటాలియన్ అధికారులు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగి అందరినీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా అధికారులు విజేతలకు శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా పోటీల్లో మరింత ఉత్సాహంతో పాల్గొని, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో పాల్గొన్న వారందరూ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో 15వ బెటాలియన్‌కు చెందిన అధికారులు అదనపు కమాండెంట్, సహాయకమాండెంట్ యస్. శ్రీధర్ రాజా ప్రసాద్, బి. వేణుగోపాల్ రెడ్డి, ఆర్ ఐ లు నారాయణ, కె. వి గోపాల్ ,వై.యస్ నారాయణ, ఉదయ్ కుమార్,ఆర్ యస్ ఐ లు నవీన్, సాయి కుమార్, శ్రీనాథ్, నాగేశ్వరరావు, అనిల్ కుమార్, ఆంజనేయులు, గణేష్, సూర్య, లక్ష్మణ్, ఎన్. ఎస్ ప్రసాద్ మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాని విజయవంతం చేశారు.





## జనం మెచ్చిన నేత కేటీఆర్

- మమతలో ఘనంగా జన్మదిన వేడుకలు
- పువ్వాడ ఆధ్వర్యంలో కేక్ కటింగ్.. అభిమానుల రక్తదానం
- విజనరీ లీడర్ కు శుభాకాంక్షల వెల్లువ





**ఖమ్మం ప్రతినిధి (ప్రజా జ్యోతి) జులై:** 24తెలంగాణను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో ప్రపంచపటంలో నిలిపి, నవతరం ఆలోచనలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన విజనరీ లీడర్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్ ) జన్మదిన వేడుకలు ఖమ్మం నగరంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని మమత హాస్పిటల్ ఆవరణలో ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, అభిమానుల నడుమ సంబరాలు అంబరాన్నంటాయి. వేడుకలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యవత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి తమ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ తెలంగాణను అభివృద్ధి పథంలో పరుగులు తీర్పించిన యువ నాయకుడు కేటీఆర్ ఐటీ, పరిశ్రమల రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టి, లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నవతరం రాజకీయాలకు కేటీఆర్ ఒక దిక్సూచిలా నిలిచారని కొనియాడారు. పట్టుదల, భవిష్యత్ ప్రణాళిక, ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్న నాయకుడు కేటీఆర్ అన్నారు. ఆయన మరెన్నో ఏళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి రాష్ట్రాన్ని మరింత పురోగతి వైపు నడిపించాలి అని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు ఆర్ జె సి కృష్ణ, దేవభక్తుని కిషోర్ బాబు, గొల్లపూడి రాంప్రసాద్, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటి, పగడాల నాగరాజు, బి రెడ్డి నాగచంద్రారెడ్డి, బిక్కసాని ప్రశాంత లక్ష్మి , షేక్ మక్బుల్, కర్నాటి కృష్ణ, షేక్ షకీనా, వాంకుడోత్ సురేష్, కందాల వీరేంద్ర, ఉస్మాన్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, వెంకట్, తమ్మి రమేష్, పరిమళ ప్రవీణ్, షేక్ యూసుఫ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయం చేశారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు



**చింతకాని, జూలై 24 ప్రజాజ్యోతి :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్ ) జన్మదినాన్ని పురస్కరించుకుని చింతకాని మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం చిన్నారులకు కేక్ పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ పరిపాలన తదితర రంగాల్లో ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకువచ్చాయని కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ యువతకు ఆదర్శంగా నిలిచిన నాయకుడు కేటీఆర్ అని పేర్కొంటూ, ఆయనకు ఆయురారోగ్యాలు కలిగి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని పార్టీ ఐక్యతను చాటారు. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.ఈ కార్యక్రమంలో చింతకాని మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు,మాజీ ఎంపీపీలు,సొసైటీ డైరెక్టర్లు, వివిధ హోదాలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు,సర్పంచులు, మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,గ్రామ అధ్యక్షులు, యువ నాయకులు,పార్టీ కార్యకర్తలు,గ్రామ పెద్దలు, మహిళలు,చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కారేపల్లిలో కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు



**కారేపల్లి, జూలై 24, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి బస్టాండ్ సెంటర్ లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శుక్రవారం బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ పుట్టినరోజు సందర్భంగా మాజీ జెడ్పిటిసి వాంకుడోత్ జగన్, సింగరేణి మండల బిఆర్ ఎస్ నాయకులు డొంకెన రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా బర్త్డే వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనిషా లక్ష్మి మదన్ లాల్ ముఖ్య అతిథిగా పాల్గొని కేటీఆర్ బర్త్ డే కేక్ ని కట్ చేసి స్వీటు పంచి కేటీఆర్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీ రంగంలో భారత దేశమంతా తెలంగాణ వైపు చూసే విధంగా ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత కేటీఆర్ ది సౌమ్యుడు పరిపాల దక్షుడు యువ నాయకుడు కేటీఆర్ అని పొగిడారు.ఈ యొక్క కార్యక్రమంలో భాగ్యనగర్ తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ బన్సీ లాల్ ,మండల నాయకులు తాత వెంకన్న, సూరవరపు రవీందర్ రెడ్డి, సింగరేణి మాజీ ఒకటో వార్డ్ నెంబర్ గంగరబోయిన సత్యం, రావోజితండా మాజీ సర్పంచి మోహన్, చీమలపాడు నాయకులు స్వామి సింగరేణి మండల యూత్ నాయకులు సోమందుల నాగ రాజు, గంగరబోయిన మురళి, పొక్కిలి యుగంధర్, భూక్య మధు,ధారావత్ వికాస్, పోతు రాములు, ఏన్కూరు బి,ఆర్,ఎస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు రైలు,గిద్ద వారి గూడెం నాయకులు భగవాన్లాల్, చింతల సంపత్, చింతల కృష్ణ, పొడుగు హరీష్,దామల్ల నాగరాజు, రాచబంటి రామకృష్ణ,కొన గడ్ల శ్రీకాంత్ ,అప్పాయి గూడెం,నాయకులు రామారావు, విష్ణు, మొట్లగు డేము నాయకులు నామ శంకర, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

- SFI- DYFI ఆధ్వర్యంలో ప్రదర్శన.

**కారేపల్లి, జూలై 24, ప్రజా జ్యోతి:** దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థుల పై మోడీ ప్రభుత్వ నిర్బంధకాండ కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల పిలుపుమేరకు సింగరేణి మండలంలో SFI – DYFI ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా విద్యార్థులతో అంబేద్కర్ సెంటర్ నుంచి కారేపల్లి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్లో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్, డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు కే నరేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కే. నాగేశ్వరావు మాట్లాడుతూ జులై 20 తారీకు భారతదేశ చరిత్రలో చీకటి రోజు అని పేర్కొన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జంతర్ మంతర్ నుండి పార్లమెంట్కు శాంతియుతంగా మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థులపై లాఠీ చార్జ్, వాటర్ క్యానన్స్, డియర్ గ్యాస్, భాష్పవాయు ప్రయోగించడం మోడీ ప్రభుత్వం నిరంకుషత్వానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థుల చదువుకు భద్రత కల్పించలేని ప్రభుత్వం ఈ భారతదేశాన్ని కాపాడుతుందని చెప్పడం విడ్డూరమని, పరీక్ష పేపర్లను పరిరక్షించలేని మోడీ దేశ సరిహద్దులను కాపాడటం ప్రగల్బాలు పలకడమేనని అన్నారు .హిందూ మత రక్షణ గురించి మాట్లాడే బిజెపి నాయకత్వం నీట్ పేపర్ లీకేజీ తో నష్టపోయిన వారిలో మరణించిన వారిలో హిందువులు లేరా అని ప్రశ్నించారు. ప్రధాన కారణమైన విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను మంత్రివర్గం నుంచి తొలగించకుండా పైపై పూతలు పూసి అసలు సమస్య నుంచి పక్కదారి పట్టించడం కోసం మోడీ వ్యవహరిస్తున్నారని ఇది విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించవలసి వస్తుందని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల కాలంలో 14 పేపర్ లీకేజీలు జరిగాయని విద్యారంగం పట్ల మోడీ ప్రభుత్వ డొల్లతనాన్ని చూపిస్తున్నదని అవినీతికి నిదర్శనంగా మారుతున్నదని వీటికి వ్యతిరేకంగా విద్యార్థులు ఐక్యమై ఐక్య పోరాటాలు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ బంద్ ప్రదర్శనలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు చిలుముల భరత్, కాకాటి పృధ్వి, ఆదర్ల నాగరాజు, భూక్య శరత్, ఎడారి నవీన్ వివిధ పాఠశాలల కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకోవాలి

- ఎల్‌నినో ప్రభావం – నీటి కొరత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందాలి
- జిల్లా ఇన్‌చార్జి ఉద్యాన అధికారి వి. అనిత శ్రీ



**ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి ) జూలై: 24** ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ సంవత్సరం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటల సాగుకు బదులుగా నీటి పొదుపు సాంకేతికతలను అనుసరిస్తూ ప్రత్యామ్నాయ ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఇన్‌చార్జి ఉద్యాన అధికారి వి. అనిత శ్రీ సూచించారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్న ఆమె, ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీటితో సుమారు ఐదు ఎకరాల వరకు ఉద్యాన పంటలు లేదా కూరగాయల సాగు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం అందించే ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని వివరించారు.ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా బీరకాయ, సొరకాయ, దొండకాయ, కాకరకాయ, బెండకాయ, వంకాయ, టమాటా, చిక్కుడు వంటి కూరగాయల సాగును ప్రోత్సహించాలని ఆమె సూచించారు. ఈ పంటలు తక్కువ కాలంలో దిగుబడులు ఇవ్వడంతో పాటు రైతులకు నిరంతర ఆదాయాన్ని సమకూర్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే రెండు నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశాలు లేనందున రైతులు అధిక పెట్టుబడి అవసరమయ్యే మిరప మరియు వరి సాగు విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె కోరారు. ముఖ్యంగా మిరప సాగుకు భారీ పెట్టుబడులు అవసరమవుతాయని, నీటి కొరత ఏర్పడినట్లయితే పంట తీవ్రంగా దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు అధిక రిస్క్ ఉన్న పంటలకు బదులుగా ఉద్యాన పంటలు, కూరగాయలు మరియు పండ్ల తోటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వడం శ్రేయస్కరమని సూచించారు.నీటి పొదుపు చర్యల్లో భాగంగా మల్చింగ్ షీట్ వినియోగం ఎంతో ప్రయోజనకరమని ఆమె తెలిపారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్, కూరగాయలు మరియు ఇతర ఉద్యాన పంటలలో మల్చింగ్ షీట్ ఉపయోగించడం ద్వారా నేలలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో పాటు కలుపు మొక్కల నివారణ, నీటి వినియోగం తగ్గింపు మరియు పంటల పెరుగుదల మెరుగుపడుతుందని వివరించారు. ఈ పథకం కింద ఉద్యాన శాఖ ద్వారా ఎకరానికి రూ.8,000/– సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు.అదే విధంగా, తీగజాతి కూరగాయల సాగు కోసం శాశ్వత కూరగాయ పందిళ్ల (పండల్) నిర్మాణానికి ఉద్యాన శాఖ ద్వారా రూ.1,00,000/– వరకు సబ్సిడీ అందుబాటులో ఉందని తెలిపారు. బీరకాయ, సొరకాయ, దొండకాయ, కాకరకాయ వంటి తీగజాతి కూరగాయలను శాశ్వత పందిళ్లపై సాగు చేయడం ద్వారా తక్కువ నిర్వహణ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి రైతులు స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు.కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు జామ, ఉసిరి, సీతాఫలం, మామిడి వంటి తక్కువ నీటి అవసరమయ్యే పండ్ల తోటలను అభివృద్ధి చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ పంటలు వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండటంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ఆదాయ వనరుగా నిలుస్తాయని పేర్కొన్నారు.మట్టిలో సేంద్రియ కార్బన్ శాతాన్ని పెంచేందుకు రైతులు జనుము వంటి పచ్చిరొట్ట ఎరువు పంటలను సాగు చేయాలని సూచించారు. ఇటువంటి పంటలను నేలలో కలపడం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం మెరుగుపడి, భవిష్యత్తులో పంటల ఉత్పాదకత పెరుగుతుందని వివరించారు.నీటి వినియోగ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) సౌకర్యాన్ని సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. డ్రిప్ ద్వారా మొక్కలకు అవసరమైన నీరు నేరుగా వేర్ల వద్దకు చేరడంతో పాటు ఫర్టిగేషన్ విధానంలో ఎరువులను కూడా సమర్థవంతంగా అందించవచ్చని, దీని వల్ల నీరు, ఎరువుల వినియోగం తగ్గి పంటల దిగుబడి మరియు నాణ్యత పెరుగుతాయని తెలిపారు. అర్హులైన రైతులు సమీప ఉద్యాన శాఖ కార్యాలయాలను సంప్రదించి ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే నీటి కొరత పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులు, నీటి పొదుపు సాంకేతికతలు మరియు ప్రభుత్వ సబ్సిడీ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని ప్రత్యామ్నాయ ఉద్యాన పంటల సాగు ద్వారా అధిక ఆదాయాన్ని సాధించాలని జిల్లా ఇన్‌చార్జి ఉద్యాన అధికారి వి. అనిత శ్రీ పిలుపు నిచ్చారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

- ముఖ్య అతిథిగా పాలేరు గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎన్. విద్యాసాగర్





**పాలేరు ఆర్. సీ జూలై24 ప్రజా జ్యోతి** మత్స్య పరిశోధన స్థానం పాలేరు, పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు ఆధ్వర్యంలో మత్స్య శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు వారి సహకారంతో భారతీయ వ్యవసాయ మరియు పరిశోధన మండలి, న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ మత్స్య కారులకు జరుగుతున్న జలాశయాలలో చేపల పెంపకం యాజమాన్య పద్ధతులు అను అంశంపై 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం లో ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ ఎన్. విద్యాసాగర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్, పాలేరు మాట్లాడుతూ తెలంగాణ మత్స్యకారులు మత్స్య రైతులు ఆక్వాకల్చర్ రంగంలో ముందుకు రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సబ్సిడీ పథకాలతో పాటు బ్యాంకులలో రైతులకు ఉండే వివిధ పథకాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు లోన్లను కూడా ఉపయోగించుకొని ఆక్వా రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని కోరారు.అదేవిధంగా మత్స్య పరిశోధన స్థానం పాలేరు మత్స్య శాస్త్రవేత్తలు మీకు అందిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని వారు అందించిన ఈ ఉపకరణాలను ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.డాక్టర్ ఎం. శ్యాం ప్రసాద్ సీనియర్ మత్స్య శాస్త్రవేత్త అధిపతి మత్స్య పరిశోధన స్థానం పాలేరు మాట్లాడుతూ జలాశయాలలో చేపల పెంపకం యాజమాన్య పద్ధతుల మీద ఇక్కడ నేర్చుకున్న ప్రతి విషయాన్ని మన తెలంగాణ మత్స్య రైతులు ఆచరణలో పెట్టి మంచి లాభాలని పొందాలని కోరారు అలాగే ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశాన్ని మీ తోటి సహచరులకు మిత్రులకు కూడా తెలియపరచాలని కోరారు. పి. శాంతన్న మాట్లాడుతూ దడి పంజరపు చేపల పెంపకంలో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి మేత యాజమాన్యం గురించి మత్స్యకారులకు క్లుప్తంగా వివరించారు. బి. బానోతు రవీందర్ మత్స్య శాస్త్రవేత్త మాట్లాడుతూ జలాశయాలలో చేపల పెంపకం చేపట్టేటప్పుడు తీసుకోవలసిన మేలైన నీటి నాణ్యత యాజమాన్య పద్ధతులను గురించి తెలంగాణ మత్స్యకారులకు సంక్షిప్తంగా వివరించారు.నాగరాజు మాట్లాడుతూ చెరువులలో చేపలకు సర్వసాధారణంగా వ్యాప్తి చెందే వ్యాధుల గురించి మరియు వాటి నివారణ మార్గాల గురించి తెలంగాణ మత్స్య రైతులకు క్లుప్తంగా వివరించారు. బానోతు దివ్య ప్రొఫెషనల్, మత్స్య పరిశోధన స్థానం మాట్లాడుతూ నాస్పాడ్ రిపోర్ట్ ఫిష్ డిసీజ్ యాప్ యొక్క విశిష్టతను తెలుపుతూ ఆ యాప్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు మరియు యాప్ ని డౌన్లోడ్ చేపించి చేపల వ్యాధులను ఎలా నివారించాలో క్లుప్తంగా వివరించడం జరిగింది.చివరిగా ప్రశంస పత్రాలను తెలంగాణ మత్స్యకారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లాలో వివిధ మండలాల నుంచి 16 మంది మత్స్యకారులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మాస్టార్ ప్లాన్ అభివృద్ధి పనులకు అడుగులు...!

- బౌద్ధక్షేత్రం పనులు ఆర్అండ్ బీ కి అప్పగింత బౌద్ధక్షేత్రం ను సందర్శించిన టూరిజం
- జిల్లా అధికారి సుమన్ చక్రవర్తి



**నేలకొండపల్లి, జూలై 24 ప్రజా జ్యోతి:** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలతో చేపట్టనున్న బౌద్ధక్షేత్రం మాస్టర్ ప్లాన్. అభివృద్ధి పనులకు తొలి అడుగులు పడ్డాయి. బౌద్ధక్షేత్రం లో చేపట్టనున్న మాస్టార్ ప్లాన్ అభివృద్ధి పనులను రోడ్డు భవనాల శాఖ కు అప్పగించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం బౌద్ధక్షేత్రం ను జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి ఆర్అండ్బ అధికారులతో కలిసి సందర్శించారు. బౌద్ధక్షేత్రంలో బుద్ధిస్టు కు సంబంధించిన మాస్టార్ అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించారు. మాస్టార్ ప్లాన్ లో చేయాల్సిన అభివృద్ధి పనులు ఎక్కడెక్కడ ఏమీ చేయాలి... వాటికి బడ్జెట్ ఇతరత్రా అంశాల పై టూరిజం మరియు ఆర్అండ్ బీ అధికారులు కసరత్తు చేపట్టారు. స్థానిక బౌద్ధక్షేత్రం లో మాస్టార్ ప్లాన్ కు సంబంధించిన మ్యాఫ్, అభివృద్ధి ఇన్ఫ్రక్చర్, బడ్జెట్ పూర్తి వివరాలతో ప్రతిపాధనలను సిద్ధం చేసి మంత్రి శ్రీనివాసరెడ్డి అమోదం పొందిన తరువాత నెల రోజులలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్ బీ డీఈఈ భగవాన్, జెఈ పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**పాలేరు ఆర్.సి జూలై24 ప్రజా జ్యోతి** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు 50వ జన్మదిన వేడుకలు మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి బాణసంచా కాల్చుతూ సంబరాలు నిర్వహించి అనంతరం కేటీఆర్ కి నాయకులు కార్యకర్తలు అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ అధ్యక్ష కార్యదర్శులు వేముల వీరయ్య , మహమ్మద్ ఆసిఫ్ పాషా మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, పారిశ్రామిక రంగ విస్తరణ, ఐటీ ప్రగతి యువతకు ఉపాధి కల్పనలో కేటీఆర్ అందించిన సేవలు చిరస్మరణీయమనీ, ప్రపంచస్థాయి ఐటీ కంపెనీలు హైదరాబాద్కు తీసుకు వచ్చిన ఘనత కేటీఆర్ గారిదే అన్నారు, సుస్థిర పాలన, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ దేశవ్యాప్తంగా యువ నాయకులకు ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. గులాబీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో, కేటీఆర్ మార్గదర్శకంలో బీఆర్ఎస్ పార్టీ రాబోయే రోజుల్లో మరిన్ని ఘన విజయాలు సాధిస్తుందని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మల్లిడి వెంకటేశ్వరరావు, జరుపుల బాలాజీ నాయక్, కాసాని సైదులు, మహేష్ నాయక్, కిషన్ నాయక్, బానోత్ శ్రీను నాయక్, నాగు నాయక్, కుంభం కిరణ్ రెడ్డి, రాయబారపు రమేష్, కొవ్వూరి పాపిరెడ్డి , బుచ్చిబాబు,వీరన్న, శంకర్, గండు రామన్న, వడిత్యా రాజేష్ , సంద్ర బజార్, ప్రభాకర్ రెడ్డి,రామ్మూర్తి, భారీ రమేష్ యాదవ్, నల్లగాటి నాగయ్య, మక్కపల్లి రామకృష్ణ, ఆదేపు సతీష్, ఉదయ్ ,దామల్ల ఉపేందర్, ఆదేపు వెంకటేష్, సైదులు,రవి, జానయ్య, ఓర్సు వెంకన్న, సైదిబాద్, అనిల్ కుమార్, పార్టీ కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- పండ్లు పంపిణీ చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**రఘునాథపాలెం ప్రజా జ్యోతి** రఘునాథపాలెం మండల టీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) 50 వా జన్మదిన వేడుకలను మదర్ తెరిసా అనాథాశ్రమంలో శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అనాథాశ్రమంలోని చిన్నారులకు పండ్లు, వంట నూనె, బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సేవా కార్యక్రమాన్ని మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అజ్మీర వీరు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా భగవంతుడిని ప్రార్థిస్తున్నామని నాయకులు తెలిపారు.

# ఎల్ నీనో ప్రభావం నేపథ్యంలో ఆరుతడి పంటల సాగు చేయాలి



**తిరుమలాయపాలెం,ప్రజా జ్యోతి,జూలై 24:** ఈ ఏడాది ఎల్ నీనో ప్రభావం కారణంగా రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, రైతులు పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ విస్తరణ అధికారి వై.సాధన సూచించారు.శుక్రవారం కాకరవాయి గ్రామపంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాధార వ్యవసాయాన్ని దృష్టిలో ఉంచుకొని జొన్న, సజ్జ, రాగులు, పెసర, మినుములు, కందులు, శనగ, నువ్వులు, వేరుశెనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు.వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు శాస్త్రీయ సాగు విధానాలను అనుసరించాలని, విత్తనాల ఎంపిక, నేల పరీక్ష, ఎరువుల సమతుల్య వినియోగం, కలుపు నివారణ, తేమ సంరక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అందించే సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం ఇరిగేషన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, గ్రామంలోని చెరువుల్లో మోటార్లు ఏర్పాటు చేసి నీటిని పొలాలకు తరలించడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. చెరువుల నీరు తాగునీటి అవసరాలు, పర్యావరణ సమతుల్యత, భూగర్భ జలాల సంరక్షణ కోసం ఎంతో కీలకమని పేర్కొన్నారు.ప్రభుత్వ అనుమతి లేకుండా చెరువుల్లో మోటార్లు ఏర్పాటు చేసి సాగునీటిగా వినియోగిస్తే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థులు, రైతులు ప్రభుత్వ నిబంధనలను పాటించి నీటి వనరులను సంరక్షించాలని కోరారు.ఎల్ నీనో ప్రభావం వల్ల ఏర్పడే పరిస్థితులను ఎదుర్కోవడంలో ప్రతి రైతు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని అధికారులు సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ గూడూరు ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి అంబాల అంజి మాట్లాడుతూ..ఎల్ నీనో ప్రభావం నేపథ్యంలో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను తప్పకుండా పాటించాలని అన్నారు. గ్రామంలోని చెరువులు, నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత అని పేర్కొన్నారు. చెరువుల్లో ఎవరూ అనుమతి లేకుండా మోటార్లు ఏర్పాటు చేసి నీటిని వినియోగించవద్దని, అలాంటి చర్యలు గ్రామ ప్రయోజనాలకు విరుద్ధమని చెప్పారు. రైతులందరూ ఐకమత్యంతో నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గ్రామపంచాయతీ తరఫున రైతులకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబాల అంజి, ఆత్మ కమిటీ డైరెక్టర్ నాగేశ్వరరావు, వెటర్నరీ లైఫ్ స్టార్ట్ అసిస్టెంట్ ఆర్. చంద్రయ్య, విద్యుత్ శాఖ ఆఫీసర్ శ్రీను వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామపంచాయతీ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోట మైసమ్మ జాతర దుకాణాల వేలం పాటలు...ఇన్స్పెక్టర్ ఆర్ సమత



**కారేపల్లి,జులై 24, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో కొలువై ఉన్న కోట మైసమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో దసరా పండగ సందర్భంగా నిర్వహించు జాతర సందర్భంగా ఏర్పాటు చేసే దుకాణాల నిర్వహణకు దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ ఆర్.సమత,ఆలయ ఈవో కే.వెంకటయ్య ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు.ఈ బహిరంగ వేలంలో రెండు దుకాణాలకు సంబంధించి వేలం పాటదారులు డిపాజిట్లు చెల్లించకపోవడంతో తాత్కాలికంగా నిలిపివేశారు.కాగా మిగతా దుకాణాలు కొబ్బరికాయలు, పూజా సామగ్రి దూదిమెట్ల వెంకటేశ్వర్లు,లడ్డూ పులిహోర నన్నే బోయిన మల్లయ్య,కొబ్బరి చిప్పల సేకరణ కోప్పు శెట్టి త్రిమూర్తులు, ఐస్క్రీం భాస్కరిలక్ష్మి లు హెచ్చు పాటతో దక్కించుకున్నారు.కాగా ఈవిక్రయాలకు సంబంధించి వేలం గతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది.మొత్తంగా నాలుగు దుకాణాలపై గతంలో కంటే 2,19,500 రూ.అదనపు ఆదాయం సమకూరింది.వేలంపాట ద్వారా దక్కించుకున్న దుకాణదారులు అక్టోబర్ నెల 15వ తారీకు నుంచి 25వ తారీకు వరకు 11 రోజుల పాటు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్విఘ్నంగా దేవాదాయ శాఖ నియమి నిబంధన ప్రకారం నియమ నిబంధన ప్రకారం కొనసాగించవచ్చు అని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది పరస లలిత్ సాయి,మూడు మోహన్, గణితి నారాయణ, ఉసిరికాయలపల్లి సర్పంచ్ వరలక్ష్మి రాజు,ఆలయ పూజారి కొత్తలంక కైలాస శర్మ , పాటదారులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్ లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- ప్రజా నాయకుడు కేటీఆర్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించిన పార్టీ శ్రేణులు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్,తెలంగాణ ఉద్యమ నిలయం,యువతకు మార్గదర్శి, మాజీ మంత్రి ★శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలు ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్ లో అత్యంత వైభవంగా,పండగ వాతావరణంలో జరిగాయి.బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నాయకత్వంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,వివిధ అనుబంధ సంఘాల బాధ్యులు,కార్యకర్తలు ఈ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.తెలంగాణ భవన్ లో నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా కార్యకర్తల ముక్తకంఠంతో చేసిన లాంగ్ లివ్ కేటీఆర్ జై కేటీఆర్ – జై తెలంగాణ జై బీఆర్ఎస్ నినాదాలతో తెలంగాణ భవన్ ప్రాంగణం హోరెత్తింది.ఈ వేడుకల సందర్భంగా మాజీ శాసనసభ్యురాలు బానోత్ చంద్రావతి, పార్టీ ముఖ్య నాయకులు బెల్లం వేణు,ఉప్పల వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ కేటీఆర్ నాయకత్వ పటిమను,దూరదృష్టిని కొనియాడారు.తెలంగాణ రాష్ట్ర రూపురేఖలు మార్చడంలో, ఐటీ మరియు పారిశ్రామిక రంగాలలో రాష్ట్రాన్ని గ్లోబల్ మ్యాప్ పై నిలబెట్టడంలో కేటీఆర్ పాత్ర చిరస్మరణీయం. స్వయం సమృద్ధి కలిగిన నాయకుడిగా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన చొరవ అసామాన్యం. తెలంగాణ ఉద్యమం నుండి నేటి వరకు నిరంతరం ప్రజాక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కేటీఆర్ గారు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి,సంపూర్ణ ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో ప్రజలకు మరింత కాలం సేవ చేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న, వాచేపల్లి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రం,నాయకులు ముత్యాల సత్యనారాయణ,లకావత్ గిరిబాబు, ఉన్నం వీరేందర్,రావూరి శ్రీనివాసరావు,బిచ్చాల తిరుమలరావు, ముత్యాల వెంకటప్పారావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్,సద్దాం షేక్, మహమ్మద్ రఫీ,యలమద్ది రవి, బలుసు మురళీకృష్ణ, గుడా సంజీవరెడ్డి,రమాదేవి, దరిపెల్లి వీరబాబు, కృష్ణ ప్రసాద్ (కే పి),బోడ మంచా నాయక్, చందు షేక్,రామ్మూర్తి ,కొండల్ రావు,కోటేష్ యాదవ్, మట్టా వేంకటేశ్వరరావు, చీకటి రాంబాబు, బెల్లంకొండ గోపి,షారుఖ్ అర్ఫత్ తదితరులు పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా విజయవంతం చేశారు.



## కేటీఆర్ జన్మదిన సందర్భంగా మధిరలో హోరెత్తిన సేవ కార్యక్రమాలు

- పాల్గొన్న చింతకాని బిఆర్ఎస్ అభిమాన నాయకులు



**చింతకాని జులై 24ప్రజాజ్యోతి :**బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని మధిర పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల అత్యవసర రక్తం అవసరాల నిమిత్తం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.ఈ మానవీయ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, మధిర నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ లింగాల కమల్ రాజ్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సమాజ సేవయే పరమావధిగా శ్రమిస్తున్న నాయకుడు కెటిఆర్ జన్మదినం సందర్భంగా తలసేమియా పిల్లల ప్రాణాలను కాపాడేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. కేక్ కట్ చేసి, రక్తదానం చేసిన కార్యకర్తలను అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. హాజరైన చింతకాని మండల నాయకులు ఈ రక్తదాన కార్యక్రమంలో చింతకాని మండలానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాల్గొన్న వారిలో వంకాయలపాటి లచ్చయ్య,కోపూరి నవీన్,నాదెండ్ల వెంకటేష్,కొమ్ము నరేష్,పరసగాని గోపి,గోగుల ప్రభాకర్,శీలం నాగేశ్వరరావు,శీలం సతీష్,బోయిన రాజు,షేక్ మస్తాన్,షేక్ కాశి,మరియు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రియతమ నాయకుడు కెటిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించిన జిల్లా వ్యవసాయ అధికారి . పుల్లయ్య



**పాలేరు ఆర్.సీ జూలై24 ప్రజా జ్యోతి** జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) పుల్లయ్య కూసుమంచి మండలంలోని శుక్రవారం కొత్తూరు, ఎర్రగడ్డ తండా, నరసింహులగూడెం గ్రామాలను సందర్శించి, ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయంపై ఏర్పడే పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం కూసుమంచి మండలం 56% లోటు వర్షపాతంతో ఉందని, గత సంవత్సరం భూగర్భ జలమట్టంతో పోల్చి చూస్తే ఈ సంవత్సరం భూగర్భ జలమట్టం చాలా లోతుకు పడిపోయిందని ఈ పరిస్థితి రానున్న నెలల్లో తీవ్రంగా ఉండబోతుందని రైతులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా లేదా అసమానంగా కురిసే అవకాశం ఉన్నందున నీటి లభ్యతపై అనిశ్చితి ఏర్పడే అవకాశముందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు.వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ వాతావరణానుకూల వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, సర్పంచ్ నీలకంఠం , వ్యవసాయ విస్తరణ అధికారి జాని రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 26న వురిమళ్ల సునంద ఉద్యోగ విరమణ ఆత్మీయ కలయిక



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఈ నెల 26న ప్రముఖ రచయిత వురిమళ్ల సునంద ఉద్యోగ విరమణ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు భోగోజు ఉపేందర్ రావు, అక్షరాల తోవ సాహిత్య సంస్థ నిర్వాహకులు నామా పురుషోత్తం,దాసురోజు శ్రీనివాస్,రాచమళ్ల ఉపేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.ఉపాధ్యాయురాలిగా, పాఠ్య పుస్తక రచయితగా,బాలసాహితీవేత్తగా,రచయితగా వురిమళ్ల సునంద పేరొందారని తెలిపారు. తను పని చేసిన ప్రతి పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ తన సోదరి జ్ఞాపకార్థం బహుమతులు అందచేసేవారని, బాలకవులను తయారు చేశారని పేర్కొన్నారు.అనేక మార్లు విద్యార్థుల్లో దాగి వున్న సాహిత్య ప్రతిభను వెలికి తీసి వారి రచనలను తన సొంత ఖర్చుతో పుస్తకాలుగా ముద్రించారని తెలిపారు. వురిమళ్ల ఫౌండేషన్ ను స్థాపించి అటు బాలసాహిత్యాన్ని, ఇటు వర్ధమాన కవులను పోత్సహిస్తూ సాహితీ సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. గత 8 సంవత్సరాలుగా వురిమళ్ల పద్మజ, వురిమళ్ల శ్రీరాములు స్మారకార్థం అంతర్జాతీయ స్థాయిలో కవితల, కథల పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేయడమే గాకుండా విజేతల రచనలను పుస్తకాలుగా ముద్రించారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని లబ్ధప్రతిష్టులైన సాహితీ వేత్తలకు భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం స్మారక పురస్కారం అందచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని తెలిపారు. అటు ఉపాధ్యాయురాలిగా, ఇటు సాహితీవేత్తగా వురిమళ్ల సునంద ఎనలేని సేవలు చేసి కీర్తిప్రతిష్టలు పొందారని, ఆమెతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకునేందుకు ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు,ఉపాధ్యాయులు, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఖమ్మంలో కార్తికేయ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో భారీ ఆషాఢం మెహందీ (గోరింటాకు) పోటీలు





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నగరంలోని మహిళలకు మరియు యువతులకు ఒక ఆనందకరమైన వార్త. సాంప్రదాయ ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని, ప్రముఖ సంస్థ "కార్తికేయ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్స్" ఆధ్వర్యంలో ఒక అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమం మరియు పోటీని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమం: ఆషాఢం మెహందీ (గోరింటాకు) పోటీలు ఈ నెల 26 జూలై 2026 (ఆదివారం) మధ్యాహ్నం 3 గంటల నుండి ఎస్.ఆర్. కన్వెన్షన్, వైరా రోడ్డు,ఖమ్మం నగరంలోని పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలను అభినందించనున్నారు.ముఖ్య అతిథులుగా పాల్గొంటున్న ప్రముఖులువసుంధర యాదవ్ ఏసిపి, కల్లూరుతుంబూరు దయాకర్ రెడ్డి రెవెన్యూ మంత్రి పంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ డాక్టర్ లక్ష్మీ ఆకుల వాసంతి గోగినేని డాక్టర్ రాధిక రాణి కందుల (ప్రముఖ వైద్యులు)మెహందీ పోటీలతో పాటు,బోనాల పాటలకు నృత్యాలు, కల్చరల్ ప్రోగ్రామ్స్, స్కిట్స్,శారన్‌తో ర్యాంక్ వాక్ వంటి ఆకర్షణీయమైన కార్యక్రమాలు ఉంటాయి.విజేతలకు నగదు బహుమతులు అందజేయబడతాయి.మొదటి బహుమతి: రూ. 10,000రెండవ బహుమతి: రూ. 5,000మూడవ బహుమతి: రూ.3,000వీటితో పాటు, 5 కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందించబడతాయని నిర్వాహకులు తెలిపారు.నిర్వాహక బృందం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శోభారెడ్డి,శాంతి,ఆశ పద్మిని,ఉష,హేమ, స్వర్ణ,శిల్ప తదితరులు కృషి చేస్తున్నారు.ఖమ్మం నగరంలోని మహిళలు, యువతీమణులు అధిక సంఖ్యలో పాల్గొని, ఈ పోటీలను విజయవంతం చేయవలసిందిగా నిర్వాహకులు కోరారు.మరిన్ని వివరాల కొరకు సంప్రదించవలసిన సెల్ నంబర్లు 9948823462|9949927828|9182695976

## కరెంటు కార్యాలయం ఎదుట అక్రమ దుకాణాల తొలగింపు

- రోడ్డు ఆక్రమణల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికుల ఆవేదన



**సత్తుపల్లి జూలై24(ప్రజా జ్యోతి)** పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న కరెంటు కార్యాలయం ప్రాంగణాన్ని ఆక్రమించుకుని, కొంతమంది కొంతకాలంగా చిన్నచిన్న బడ్డీ దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం వాటిని ఇతరులకు నెలకు రూ.5,000 నుంచి రూ.22,000 వరకు అద్దెకు తీసుకున్నారని,ప్రస్తుతం రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు కరెంటు కార్యాలయం, ఇటు జాతీయ రహదారిపై వ్యాపారాలు నిర్వహించడం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవటం వలన,కొంచెం వెనక్కి జరగాలని ఎవరైనా సూచిస్తే వ్యాపారులు గొడవకు దిగుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ప్రజలు కోర్టును ఆశ్రయించారు.ప్రజల పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాలను అనుసరిస్తూ అక్కడ ఉన్న దుకాణాలను వ్యాపారులు గురువారం మొత్తం ఖాళీ చేర్పించారు.

## ఎల్ నీ లో పరిస్థితులను బట్టి రైతులు జాగ్రత్త వహించండి

- వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కే రుక్మిణి దేవి
- స్వల్పకాలిక వరి నారును జులై వరకు పోసుకోవచ్చు
- కీటక శాస్త్రవేత్త కే నాగ స్వాతి
- బ్రాహ్మణపల్లి, చిన్న బైరవల్లి గ్రామాలలో సందర్శించిన వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు

**బోనకల్, జూలై 24 (ప్రజా జ్యోతి ):** ఎల్ నీ లో పరిస్థితులను బట్టి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కే రుక్మిణి దేవి, కీటక శాస్త్రవేత్త కే నాగ స్వాతి ఆధ్వర్యంలో మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, చిన్న బీరవల్లి గ్రామాలలో శుక్రవారం క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు స్వల్పకాలిక వరి రకాల నారును జూలై చివరి వరకు పోసుకోవచ్చునని, వరి నాటు వేసుకునే వారం రోజుల ముందు ఒక ఎకరానికి సరిపోయే



నారుమడికి 800 గ్రాముల కార్బో ఫ్యూరాన్ 3జి గులికళ్లను ఇసుకలో కలిపి చల్లుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా పత్తి పొలాలను సందర్శించి పంట శాస్త్రీయ దశలో ఉన్నందున బెట్ట వాతావరణాన్ని రసం పీల్చే పురుగులైన తామర పురుగు, తెల్ల దోమ, పచ్చ దోమ, పిండి నల్లి ఆశించినందున నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా పిపో నిల్ 1.5 గ్రాములు లీటర్ నీటికి దానితోపాటు 19 -19-19 ఐదు గ్రాములు లేదా యూరియా రెండు గ్రాముల నీటికి పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. ప్రత్యామ్నాయ పంటలను సాధారణ పంటలు బదులుగా పెసర, మినుము, రాగి, నూనె గింజల పంటలను సాగు చేసుకున్నట్లయితే ఈ ఎల్ నీ లో పరిస్థితుల నుండి బయటపడే అవకాశం ఉన్నదని తెలియజేశారు. ఈ సందర్శనలో బోనకల్ వ్యవసాయ శాఖ అధికారి పసునూరి వినయ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి షేక్ హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవాలి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** టీఎన్జీవో ఇరిగేషన్ ప్రాజెక్టు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బజ్జూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నాయకత్వం ఉద్యోగుల సమస్యల కోసం పోరాట పటిమ ప్రదర్శించడమే కాకుండా తల్లి ,తండ్రినీ కోల్పోయి ఆపదలో కష్టకాలంలో దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆ నలుగురు ఆడ పిల్లలను అందుకొని ఇటీవల చనిపోయిన నర్సింగ్ (లస్కర్) కుటుంబానికి అపన్న హస్తం అందించి ఈరోజు తమ వంతుగా ఆర్థిక సహాయం అందజేయడం జరిగినది.ఇరిగేషన్ ప్రాజెక్టు ఎంప్లాయిస్ యూనియన్ చరిత్రలోనే ప్రప్రదంగా ప్రస్తుతం పనిచేస్తున్న చురుకైన జిల్లా నాయకత్వం ఒక్కటిగా నిలిచి ఆ కుటుంబాన్ని ఉడతా భక్తిగా చిన్న సహాయం చేసి ఆదుకోవడం ఆ నలుగురి ఆడపిల్లల కళ్ళల్లో ఆనందం నింపడం జరిగినది.ఇంకా ముందు ముందు విపత్కాల పరిస్థితిలో అనుకోని సంఘటనలు జరిగి నలిగిపోతున్న ఇలాంటి మన ఉద్యోగ మరికొన్ని కుటుంబాలకు సైతం ఉడతా భక్తిగా సహాయ సహకారాలు అందిస్తూ మన వరవడిని ఇలాగే కొనసాగిద్దాం మన ఉద్యోగ కుటుంబాల్లో ఇకనుండి మీకు మేము సైతం ఉన్నామంటూ ధైర్యాన్ని వారి కళ్ళల్లో మన వంతు కొంచమైనా ఆనందాన్ని వెలుగులను నింపుదామని యూనియన్ జిల్లా అధ్యక్షులు బజ్జూరి రమణారెడ్డి కార్యదర్శి శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న పలు యూనియన్ జిల్లా నాయకులు రాజకీయ నాయకులు అధికారులు తోటి ఉద్యోగస్తులు పలువురు వీరిని అభినందనలతో ముంచెత్తారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తొక్కేపాండా సురేష్, కోశాధికారి ఈశ్వర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాటి మల్లారెడ్డి ఆఫీస్ ఇంచార్జ్ సూరిబాబు పాలేరు డివిజన్ నాయకులు ఉల్లోజు వెంకన్న తదితరులు పాల్గొని వారికి పూర్తి సహాయ సహకారాలు అందించారు.

## గ్రామ అభివృద్ధి లక్ష్యం

- మంగాపురం తండా సర్పంచ్ ధీరావత్ అశోకా రాణి



**నేలకొండపల్లి, జూలై 24 ప్రజా జ్యోతి:** మంత్రి శ్రీనివాస్ రెడ్డి చొరవ తో మంగాపురం తండా పంచాయతీని రూపురేఖలు మార్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సర్పంచ్ దీరావత్ అశోక రాణి పేర్కొన్నారు. మండలం లోని. మంగాపురం లో నూతనంగా మంజూరైన రెండు లక్షల 30 వేల వ్యయంతో మంజూరైన సైడ్ డ్రైనేజ్ పనులను శుక్రవారం ప్రారంభించారు. నిర్మాణానికి గ్రామ సర్పంచ్ ధీరావత్ అశోకరాణి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు... ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... పంచాయతీల అభివృద్ధికి మంత్రి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కార్యచరణ రూపొందించారని పేర్కొన్నారు.గత పదేళ్లలో అభివృద్ధి ని బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పడేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తో పాలేరు నియోజకవర్గం లో పనులు శరవేగంగా సాగుతున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తారన్నారు. గుడిసెలేని గ్రామాలను తయారు చేయటమే మంత్రి శ్రీనివాసరెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతీ రహదారి కి బీటీ, సీసీలు, సైడ్ డ్రైనేజ్ పనులు పూర్తి చేయటం ప్రభుత్వం ఉద్దేశ్యమన్నారు. గ్రామంలో ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో, రాధాకృష్ణమూర్తి, రిటైర్మెంట్ కండక్టర్ రమణ, తేజావత్ మోహన్ రావు, భూక్య గోబ్రియా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## జూలై 26న మధిర నియోజకవర్గం జనసేన ముఖ్య కార్యకర్తల సమావేశం

- సీనియర్ నాయకులు తాళ్లూరు డేవిడ్ పిలుపు



**మధిరప్రజా జ్యోతి** మధిర నియోజకవర్గ జనసేన పార్టీ పీఓసీ సభ్యుడు తాళ్లూరు డేవిడ్ అధ్యక్షతన మధిర క్లబ్ కాంప్లెక్స్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26వ తేదీ (ఆదివారం) మధిర నియోజకవర్గ జనసేన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ హెల్త్ డైరెక్టర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జీ గడల శ్రీనివాసరావు హాజరుకానున్నారని చెప్పారు.పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి నుంచి సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాల్లూరి, పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి,రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్ సూచనల మేరకు గ్రామ, బూత్, మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయి కమిటీల ఏర్పాటుకు కార్యాచరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మధిర నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి అన్ని కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని ప్రతి గ్రామం నుంచి జనసైనికులు, వీర మహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు అనుముల నరేష్, జనసేన వీర మహిళ తోట దీపకల, జనసేన నాయకులు జొన్నల గడ్డ.భద్ర,పగడాల పవన్, నాగసాయి, ఈశ్వర్, తుమ్మాటి మధు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడికి ప్రత్యామ్నాయ మార్గాలను పెంచుకోవాలి

- ఎంపీ ఓ ఎం రవీంద్ర ప్రసాద్



**కారేపల్లి, జూలై 24, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలం మాధరం గ్రామపంచాయతీలో ఎంపీఓ రవీంద్ర ప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలీనో ప్రభావం దృశ్య వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో ముందస్తు చర్యలో భాగంగా వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారించేందుకు ప్రత్యమాయ మార్గాల కోసం కృషి చేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మాదారంలో గ్రామ ప్రజల కోసం మినరల్ వాటర్ ప్లాంటు ద్వారా అందజేసే తీరును స్వయంగా పరిశీలించి సర్పంచ్ అజ్మీరా ఉమా నరేష్‌ను ప్రశంసించారు .అదేవిధంగా పంచాయతీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. పాత బోర్ల మరమ్మతులు మంచి నీరు లభించే అన్ని వనరుల ఏర్పాటుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ నరేందర్,పంచాయతీ సెక్రెటరీ విజయ్ కాంగ్రెస్ నాయకులు అజ్మీర నరేష్ , గుర్రం నరసయ్య , కసాని లక్ష్మీనారాయణ , పంప్ ఆపరేటర్ , మల్టీపర్పస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దోమలచెరువు పరిసరాల్లో ఈత మొక్కలు నాటిన అధికారులు



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం ఎం. వెంకటయ్యపాలెం దోమలచెరువు పరిధిలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం భారీ స్థాయిలో ఈత మొక్కల నాటడం చేపట్టారు. సంఘ అధ్యక్షులు సుధాగాని వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో, ఎక్సైజ్ శాఖ సహకారంతో దోమలచెరువు–తామరచెరువు పరిధిలో సుమారు 1,000 ఈత మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఎస్ ఐ సరిత, సీఐ చంద్రమోహన్, కానిస్టేబుళ్లు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు పుచ్చకాయల వినోద్, తేజావత్ సుధాకర్, దొడ్డ నాగేశ్వరరావుతో పాటు గ్రామస్థులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కల నాటడంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని, భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకున్న బీఆర్ఎస్ నాయకులు



**తిరుమలాయపాలెం ప్రజాజ్యోతి** మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన. వేడుకలను మండలం లోని హోస్నాబాద్ గ్రామంలో, ఆ గ్రామ సర్పంచ్ కొవ్వూరి పద్మ సత్తిరెడ్డి, ఆధ్వర్యంలో వారు స్వగృహం లో ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి బి ఆర్ ఎస్ పార్టీ మండల నాయకులు కీసర సంకీర్త రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, కేకులు కట్ మిఠాయిలు పంచుకున్నారు.అనంతరం చిన్నారులకు కేక్ పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ పరిపాలన తదితర రంగాల్లో ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకువచ్చాయని కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ యువతకు ఆదర్శంగా నిలిచిన నాయకుడు కేటీఆర్ అని పేర్కొంటూ, ఆయనకు ఆయురారోగ్యాలు కలిగి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో.. బి ఆర్ ఎస్ మండల నాయకులు కొ వ్వూరి సత్తిరెడ్డి, మరియు గ్రామ నాయకులు కొవ్వూరి సందీప్ రెడ్డి మాగి వెం కన్న మోటపోతుల శ్రీనివాస్, మోటపోతుల శ్రీనివాస్( చిన్న),పల్లి వినోద్,పల్లి భాస్కర్,కశిమల్ల మహేష్ , యతకుల నాగేష్,మాగి లక్ష్మణ్, పసలాది రవి, పల్లి గోపి,తండా అంజయ్య,పసలాది నవీన్, అనబత్తుల సతీబాబు, అనబత్తుల వెంకన్న, పసలాది ఉపేందర్, పల్లి నవీన్,మాగి నరేష్,మాగి సురేష్,మరియు ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు



**కామేపల్లి ప్రజా జ్యోతి జులై 24** కామేపల్లి మండలం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు గారి 50 పుట్టినరోజు సందర్భంగా కామేపల్లి టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కన్నమాల రాంబాబు గారు కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు మరియు గ్రామ ప్రజలకు పంచడం జరిగింది ఈ పుట్టినరోజు వేడుకల్లో మండల నాయకులు అజ్మీర రాజు ముత్తిపోయిన రామ్మూర్తి అజ్మీర కుమార్ జల్లి రాములు మంచాల వెంకన్న సంపత్ జావిద్బాలు సుధాకర్ బ్రహ్మచారి పుల్లయ్య స్వామి తదితరులు పాల్గొనడం జరిగింది.

## విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం



**కామేపల్లి ప్రజా జ్యోతి జులై 24** కామేపల్లి మండలం పాత లింగాల గ్రామంలో కేజీబీవీ స్కూల్ నందు విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ దుస్తులు పంపిణీ చేయడం జరిగింది అలాగే మధ్యాహ్నం భోజనం తనిఖీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జగన్నాథరెడ్డి సర్పంచ్ కిన్నెర సుజాత ఈవో అధ్యక్షురాలు చామంతుల రమణ ఎటిఎం వెంకట్రామారావు సీసీ సుభద్ర గ్రామ దీపిక తప్ప ఉమా స్కూలు ఉపాధ్యాయులు మరియు డిసిసి జనరల్ సెక్రెటరీ నర్సిరెడ్డి పింజరమడుగు మాజీ ఎంపిటిసి నెలమూతు లక్ష్మయ్య చామంతుల విశ్వనాథం దమ్ములపాటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రుపాలెం మండల బీజేపీ అధ్యక్షుడిగా అనుమోలు సురేష్



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** ఎర్రుపాలెం మండల భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడిగా భీమవరం గ్రామానికి చెందిన అనుమోలు సురేష్ నియమితులయ్యారు. బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు నారపరాజు రామచంద్రరాజు ఆదేశాల మేరకు బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు శుక్రవారం ప్రకటించారు.పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, మండలంలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు అనుమోలు సురేష్ సేవలు ఉపయోగపడతాయని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన అనుమోలు సురేష్, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు మండలంలో పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మధిర ఇంచార్జ్ ఏలూరి నాగేశ్వరరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు నూతక్కి నరసింహారావు, మాజీ మండల అధ్యక్షుడు కొమ్మినేని కృష్ణారావు, మండల నాయకులు పుప్పాల చంద్రమౌళి, లక్కిరెడ్డి కృష్ణారెడ్డి,గరికపాటి పురుషోత్తం, దేవరకొండ కోటేశ్వరరావు,నాయకులు, కార్యకర్తలు అనుమోలు సురేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మధిరలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- **రక్తదాన శిబిరం నిర్వహణ**



**మధిర ప్రజా జ్యోతి** బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మధిర పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక సేవలో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, రక్తదానం మహాదానమని పేర్కొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వేంసూరు మండలంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- **కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు**

**వేంసూరు జులై 24 ప్రజాజ్యోతి** ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.



ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేటీఆర్ అందించిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.మండలంలోని వివిధ గ్రామాల్లో ఒకేరోజు జన్మదిన వేడుకలు నిర్వహించడంతో పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ జెండాలు, బ్యానర్లతో కార్యక్రమ ప్రాంగణాలను అలంకరించి, బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. నాయకులు ఒకరినొకరు అభినందించుకుంటూ కేటీఆర్ నాయకత్వంపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. యువతకు స్ఫూర్తిదాయక నాయకుడిగా ఎదిగిన కేటీఆర్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేశారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కేక్ పంపిణీ చేసి పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పార్టీ పట్ల తమ నిబద్ధతను చాటుతూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, గ్రామ శాఖల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నీట్ ప్రశ్నా పత్రాలు లీకేజీకి విద్యా మంత్రి రాజీనామా చేయాలి

- **సిపిఎం సీనియర్ నాయకుల డిమాండ్**



**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** పాలకవర్గాలు పెట్టుబడి వర్గానికి సామ్రాజ్యవాదులకు భూస్వాములకు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తుండటంతో కమ్యూనిస్టు పార్టీలు వాటికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తూ పని చేస్తున్నాయని వర్గ పోరాటాల ద్వారానే పార్టీ విస్తృతంగా నిర్మాణం చేపట్టాలని ఉదయం క్లాసు బోధించిన టీచర్ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య కార్యకర్తలకు బోధించారు. ఎరుపాలెం మండల పరిధిలోని భీమవరం గ్రామంలో అమరజీవి కామ్రేడ్ గొల్లపూడి రాజారావు నగర్ గా శిక్షణ తరగతుల స్థల వేదికకు నామకరణం చేసి సిపిఎం పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు తొలుత పార్టీ సీనియర్ నాయకులు గొల్లపూడి పెద కోటేశ్వరరావు శిక్షణా తరగతుల ప్రారంభ సూచికగా సిపిఎం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శిక్షణ తరగతులకు ప్రారంభ ఉపన్యాసాన్ని మధిర నియోజకవర్గ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల కాలంలో ఎన్నో ప్రశ్నాపత్రాలు లీకేజీలకు పాల్పడిందని అన్నారు. నీట్ ప్రశ్నా పత్రాలు లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థుల పైన లాఠీచార్జి చేసిన పోలీసులను అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులు సంవత్సరాలు తరబడి చదువుకొని లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలు రాస్తే ప్రభుత్వాలు ప్రశ్న పత్రాల పేపర్లను ముందుగానే లీకేజీ చేసి అనంతరం విద్యార్థుల ఆందోళనలతో వాటిని రద్దు చేస్తామంటే విద్యార్థులు ఏమై పోవాలి, వాళ్ల పడ్డ కష్టం ఏం కావాలి, తల్లిదండ్రులు ఖర్చు పెట్టిన లక్షల రూపాయలు ఏమి అయిపోతాయో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్ గా మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రావు వ్యవహరించారు. పార్టీ కార్యక్రమం – పార్టీ విశిష్టత అనే క్లాసును దివ్వెల వీరయ్య బోధించారు. సిపిఎం పార్టీ ప్రజల సమస్యల కోసం ప్రజల అవసరాల కోసం పనిచేస్తుందని అన్నారు.ఎవరికీ ఏ కష్టం వచ్చినా ప్రజల తరపున పోరాటాలు చేసేది సిపిఎం పార్టీ అని అన్నారు. రాబోయే కాలమంలో భవిష్యత్తు కమ్యూనిస్టు పార్టీలదే అని అన్నారు. మతం–మతోన్మాదం అనే క్లాసులు జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ బోధించారు. ప్రతి మనిషి తనకు నచ్చిన మతంలో ఉండవచ్చని ఎవరి మతం వారికి గొప్పదని ఎదుటివారి మతాన్ని కించపరచడం ద్వారా మత ఉన్మాదం రెచ్చగొట్టడం ద్వారా రాజకీయాలు నడపడం దేశ భవిష్యత్తుకు ప్రజలకు తీవ్రమైన ప్రమాదం అని అన్నారు.దీనిని ప్రతి ఒక్కరూ గ్రహించాలని తెలియజేశారు.కాబట్టి కమ్యూనిస్టులు మతానికి వ్యతిరేకం కాదని మతం పేర జరిగే ఉన్మాదానికి మాత్రమే వ్యతిరేకులని అన్నారు. సిపిఎం పార్టీ మండల కార్యాలయానికి తలపురెడ్డి సీతారామరెడ్డి,దివ్వెల కృష్ణమూర్తి మనమళ్లు, శీలం కోటిరెడ్డి,ఉన్నం శ్రీనివాసరావు,పొట్టేటి వెంకటనారాయణరెడ్డి, బోజడ్ల ప్రభాకర్,కూడే లి నాగేశ్వరరావు, వల్లభనేని హరి ప్రసాద్ 130 కుర్చీలు ఏడు ఫ్యాన్లు దాతలు వితరణ చేశారు.దాతలను డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, దివ్వెల వీరయ్య, మద్దాల ప్రభాకర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్లమోతు హనుమంతరావు, ఆంగోతు వెంకటేశ్వర్లు, కన్నెబోయిన శ్రీను,షేక్ లాలా,దూదిగం బసవయ్య, మేడగాని తిరుపతిరావు, కూడెల్లి నాగేశ్వరరావు, చిత్తారు కిషోర్, దివ్వెల వీరాంజనేయులు, రామిశెట్టి కోటేశ్వరరావు,అజ్మీర చంద్రు,బేతి శ్రీనివాసరావు, మందడపు ప్రభాకర్, గోధుమ వెంకటేశ్వరరావు, గొబ్బూరు కృష్ణంరాజు, షేక్ మస్తాన్,కొండేపాటి శివయ్య, నాగలవంచ సత్యనారాయణరెడ్డి, షేక్ జానీ,గొల్లపూడి లక్ష్మి ,షేక్ కరీం,వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై బీఆర్ఎస్ నిరసన

- **విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు**
- **మాజీ జెడ్పిటిసి బానోతు కొండ**

**బోనకల్, జులై 24 (ప్రజా జ్యోతి)**:నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బోనకల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి బానోతు కొండ మాట్లాడుతూ... దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా వ్యవస్థలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. కోట్లాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పరీక్షలకు సిద్ధమవుతుంటే పేపర్ లీకేజీల వల్ల వారి కష్టం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే వారిని ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని, జాతీయ స్థాయి పరీక్షల్లో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసి యువతలో నమ్మకాన్ని పెంపొందించాలని కోరారు.విద్యార్థుల శ్రమకు తగిన గౌరవం లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, విద్యా వ్యవస్థను రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు.

